ఎస్బీఐ నూతన చైర్మన్‌గా నియమితులైన శ్రీనివాసులు శెట్టిని శనివారం ముంబైలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్. చిత్రంలో వాసవి గ్రూపు చైర్మన్ యెర్రం విజయ్ కుమార్, తదితరులు

జీడీపీ అందుకే తగ్గింది!

- ప్రభుత్వ ఖర్చుల్లో ప్రతిష్టంభన, వ్యవసాయం మందగమనాలే కారణం
- ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

భువనేశ్వర్, ఆగస్టు 31: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ వృద్ధిరేటు 15 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడంపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పందించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పెట్టే ఖర్చుల్లో ప్రతిష్టంభన నెలకొనడం వల్లనే వృద్ధిరేటు మందగించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వృద్ధి 7.1 శాతంగా ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనావేయగా, కానీ 6.7 శాతానికి పరిమితమైంది. వినిమయం, పెట్టుబడులు, తయారీ, సేవలు, నిర్మాణ రంగాలు ఏడు శాతానికి పైగా వృద్ధిని కనబరిచినప్పటికీ మిగతా రంగాల్లో మందకొడి నెలకొన్నదని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చులు తగ్గించుకోవడం, వ్యవసాయ రంగాల్లో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా దేశ వృద్ధిరేటు తగ్గిందని దాస్ వ్యాఖ్యానించారు. ఎన్నికల నేపథ్యంలో తొలి త్రైమాసికంలో ప్రభుత్వ ఖర్చులు తగ్గినప్పటికీ..వచ్చే త్రైమాసికాల్లో మళ్లీ పెరిగే అవకాశాలున్నాయని, తద్వారా వృద్ధిరేటు పుంజుకుంటుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో వ్యవసాయ రంగంలో 2 శాతం మాత్రమే వృద్ధిని సాధించింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అంచనావేసినదానికంటే వర్షాలు అధికంగా కురియనుండటంతో వ్యవసాయం మెరుగైన వృద్ధి సాధించే అవకాశాలున్నాయని చెప్పారు.

ఇమామీ చేతికి హీలియోస్ లైఫ్‌స్టైల్

న్యూఢిల్లీ, ఆగస్టు 31: దేశీయ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఇమామీ..హీలియోస్ లైఫ్‌స్టైల్‌లో పూర్తిస్థాయి వాటాను కొనుగోలు చేసింది. ఇప్పటికే 50 శాతానికి పైగా వాటా కలిగివున్న ఇమామీ..తాజాగా 49.6 శాతం వాటాను హస్తగతం చేసుకున్నది. దేశంలో అత్యధిక వేగంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న వరుడు దుస్తుల విక్రయ విభాగంలో మరింత పట్టు సాధించాలనే ఉద్దేశంతో హీలియోస్‌ను కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది. 2017లో 33 శాతం వాటా కొనుగోలు చేసిన సంస్థ..ఆ తర్వాతి క్రమంలో ఈ వాటాను 50 శాతానికి పెంచుకున్నది. ప్రస్తుతం మిగతా వాటాను కొనుగోలు చేసింది. స్కిన్‌కేర్, హెయిర్ కేర్, బాడీ కేర్ ఉత్పత్తులను ది మ్యాన్ కంపెనీ పేరుతో విక్రయిస్తున్నది.

చమురుపై తగ్గిన విండ్‌ఫాల్ ట్యాక్స్

న్యూఢిల్లీ, ఆగస్టు 31: ముడి చమురుపై కేంద్ర ప్రభుత్వం మరోసారి విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను తగ్గించింది. టన్ను ధరను రూ.250 తగ్గించడంతో రూ.2,100 నుంచి రూ.1,850కి దిగొచ్చింది. తగ్గించిన ధరలు శనివారం నుంచే అమల్లోకి వచ్చాయని పేర్కొంది. విదేశాలకు ఎగుమతి అవుతున్న ఇంధనాలపై వస్తున్న లాభాలపై విధిస్తున్న ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్ జూలై 1, 2022 నుంచి కేంద్ర సర్కార్ అమల్లోకి తెచ్చింది.

ఏపీకి పునరావాసంగా తెలంగాణ

- కీలక పదవుల్లో పొరుగు రాష్ట్రం అధికారులు
- తెలంగాణ వచ్చినా ఇంకా ఏపీ వారికేనా పదవులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తెలంగాణవాదుల ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ అధికారులు, పొరులకు పదవులు పొందడానికి తెలంగాణ రాష్ట్రం పునరావాస కేంద్రంగా మారిందని తెలంగాణవాదులు విమర్శిస్తున్నారు. కీలకమైన పదవుల్లో ఏపీకి చెందిన వారిని నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పాలకులు ప్రభుత్వ పదవులను ఆంధ్రప్రదేశ్ వారికి ఇస్తూ తమ స్వామి భక్తిని చాటుకుంటున్నారని విమర్శిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటికే పలు కీలక పదవుల్లో ఏపీకి చెందిన వారిని నియమించారు. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి ఆంజనేయరెడ్డిని బుద్ధవనం ప్రాజెక్టు పర్యవేక్షకుడిగా ప్రభుత్వం నియమించింది. ఆగస్టు 19న జీవో విడుదలైనా దానిని బయటికి రాకుండా రహస్యంగా ఉంచి శనివారం బయటపెట్టారు. ఆంజనేయరెడ్డి రాయలసీమకు చెందిన వ్యక్తి. తెలంగాణతో, తెలంగాణ ఉద్యమంతో సంబంధంలేని అధికారి. ఆయనను ఏరి కోరి తెచ్చుకోవడంపై తెలంగాణవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన ఆదిత్యనాథ్‌దాస్‌ను రాష్ట్ర నీటిపారుదలశాఖ సలహాదారుడిగా నియమించారు. ఏపీకి చెందిన మాజీ ఐఏఎస్ శ్రీనివాస్‌రాజు స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా తెలంగాణ ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ సలహాదారుడిగా నియమించింది. అసెంబ్లీ సలహాదారుడిగా అయ్యదేవర ప్రసన్నకుమార్‌ను నియమించారు. ఇటీవలే రెడ్కో ఎండీగా అనంతపురానికి చెందిన అనిల వావిల్లకు పోస్టింగ్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి) డైరెక్టర్ జనరల్‌గా ఏపీకి చెందిన నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ నియమితులయ్యారు.

తెలంగాణలో అర్హులు లేరా?

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వారికి ప్రతిభ ఉన్నా అణచివేశారని, నాడు ఎంతో నష్టపోయామని, ఇప్పుడు కూడా నష్టపోవాల్సిందేనా అంటూ తెలంగాణవాదులు వాపోతున్నారు. తెలంగాణ సాధించుకున్నదే ఇక్కడి వారికి అవకాశాలు రావడానికి అని, అర్హులు, మేధావులు, ప్రతిభ ఉన్న వారు ఇక్కడ లేరా అంటూ కాంగ్రెస్ నేతలను ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ వచ్చినంక కూడా కాంగ్రెస్ వాళ్లు.. ఏపీ వాళ్లే ముద్దు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు ఉమ్మడి రాష్ట్రంలో మొదటి నుంచి కూడా వెన్నుపూస లేనివారుగా వ్యవహరించే వారని, అదే సంస్కృతిని ఇంకా కొనసాగిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఏపీ నేతల అధిపత్య పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వాదులు, ఉద్యమకారులు తాజా పరిణామాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ఆత్మాభిమానం దెబ్బతినే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ముఖ్యనేతల్లో ఇప్పటికైనా మార్పు రావాలని, లేకుంటే తెలంగాణ వాదుల నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

పార్టీ పదవులు కూడా వారికేనా?!

ప్రభుత్వ పదవులే కాకుండా చివరికి పార్టీ పదవులను కూడా కాంగ్రెస్ నేతలు ఏపీ వారికి ఇస్తున్నారని తెలంగాణ వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని నియమించారని ఆ పార్టీ నాయకులే తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై వారు ఏఐసీసీకి ఫిర్యాదు కూడా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా ఆత్మగౌరవం, ఆత్మాభిమానంతో వ్యవహరించాలని, రిమోట్ కంట్రోల్ ద్వారా కాకుండా స్వతంత్రంగా, ప్రజల ప్రయోజనాలు రక్షించే విధంగా ఉండాలని సూచిస్తున్నారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ఆసరవెల్లిలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజన రైతులు

ఎమ్మెల్యేపై భగ్గుమన్న గిరిజన రైతులు

- రంగాయచెరువు ప్రాజెక్ట్ పేరుతో రీ డిజైన్‌కు ఒప్పుకోం
- ఆసరవెల్లిలో దొంతి మాధవరెడ్డి దిష్టిబొమ్మ దహనం

నల్లబెల్లి, ఆగస్టు 31: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రంగాయచెరువు ప్రాజెక్టు నిర్మాణానికి రీడిజైన్ చేయడంతోపాటు నిధులు మంజూరు చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఇటీవల భూపాలపల్లి జిల్లాలో జరిగిన చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు సమీక్షలో లేవనెత్తడంపై మండలంలోని ఏజెన్సీ గ్రామాల గిరిజన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆసరవెల్లి గ్రామంతోపాటు లక్ష్మీతండా, మేడెపల్లి గ్రామాల రైతులు ఆసరవెల్లిలో శనివారం ఎమ్మెల్యే దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. రైతులు మాట్లాడుతూ.. మార్పు పేరుతో మాయమాటలు చెప్పి తమ ఓట్లు దండుకొని ఎమ్మెల్యేగా గెలిచాక, తమ గ్రామాలనే ముంచే యత్నం సరికాదని మండిపడ్డారు.

రేవంత్‌రెడ్డికి సమన్లు

- నవంబర్ 6న విచారణకు రావాలని కోర్టు ఆదేశం

నాంపల్లి కోర్టులు, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా పెద్దవూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు శనివారం సమన్లు జారీ చేసింది. ఐపీసీలోని 269, 188 సెక్షన్లతో పాటు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టం కింద నిరుడు నమోదైన ఈ కేసులో సీఎం రేవంత్ లేదా ఆయన తరపు న్యాయవాది నవంబర్ 6న విచారణకు హాజరు కావాలని ఆ సమన్లలో స్పష్టం చేసింది. రేవంత్‌తోపాటు మరో నిందితుడు టీ చంద్రశేఖర్‌రెడ్డిని కూడా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఇంతకాలం ఈ కేసులో సమన్లు జారీ చేయకుడా అలసత్వం వహించిన సదరు పోలీస్ స్టేషన్ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కాగా, ఇదే పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసులో అక్టోబర్ 10న విచారణకు హాజరు కావాలని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఆయనకు సమన్లు పంపాలని ఉత్తర్వులు జారీ చేసింది.

డబ్బులు ఢిల్లీకి.. అభివృద్ధి అమరావతికి

- హైడ్రా పేరుతో హైడ్రామా ఆపాలి
- ప్రభుత్వానివి అనాలోచిత నిర్ణయాలు
- హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీసే కుట్ర
- పెట్టుబడులు ఏపీకి మళ్లించడమే సీఎం లక్ష్యం
- పేదలకు ప్రత్యామ్నాయం చూపాలి
- బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): హైడ్రాతో హైడ్రామా క్రియేట్ చేసి హైలెవల్ కమీషన్లు దండుకోవడమే రేవంత్‌రెడ్డి లక్ష్యమని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. హైడ్రాను బ్లాక్ మెయిలింగ్‌కు వాడుకొని డబ్బులు ఢిల్లీకి, అభివృద్ధిని అమరావతికి, రెమ్యునరేషన్ రేవంత్‌రెడ్డికి, తెడ్డు తెలంగాణకు ఇదే కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి లక్ష్యమని ఆరోపించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతియ్యాలని రేవంత్ కుట్ర చేస్తున్నారని, ఆకస్మిక, అనాలోచిత కూల్చివేతలతో భయభ్రాంతులకు గురిచేసి రియల్ ఎస్టేట్‌ను కుదేలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. పెట్టుబడులను అమరావతికి మళ్లించడమే రేవంత్ లక్ష్యమని ఆరోపించారు. పేదల ఇండ్ల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హైడ్రాకు ఉన్న చట్టబద్ధత ఏమిటని ప్రశ్నించారు. వరంగల్ పేదల ఇండ్ల జోలికి వస్తే సహించబోమని హెచ్చరించారు. హైడ్రాకు తాము వ్యతిరేకం కాదని, పేదల ఇండ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. రేవంత్ కుటుంబానికి ఒక రూలు, ప్రజలకు ఒక రూలా? అని ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చివేత కారణంగా రోడ్డున పడిన వారికి తక్షణమే ఇల్లు కట్టించి ఇవ్వడంతోపాటు పరిహారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అస్మత్‌పేట, అల్వాల్, సరూర్‌నగర్, బోయిన్‌పల్లి, రాజీవ్‌నగర్, ఖాజాగూడలో పేదల ఇండ్లకు కూల్చివేత నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు.

సూరం చెరువు కబ్జా నిజమే

మొదటిపేజీ తరువాయి...

తన వాటా తీసుకొని వైదొలిగినట్టు వివరించారు. ఈ చెరువు కబ్జాపై తానే చాలాకాలంగా అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తున్నానని, అధికారులు స్పందించడం లేదని అన్నారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సైతం ఈ చెరువు కబ్జాపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ వెంచర్‌లో కేవలం సూరం చెరువు మాత్రమే కాదని, ఇంకో నీటి వనరును కూడా పూర్తిగా మట్టితో పూడ్చివేశారని కేఎల్ఆర్ వెల్లడించారు. ఈ కబ్జాలపై ఫిర్యాదు చేసి, పోలీసు కేసులు కూడా నమోదు చేయించినట్టు చెప్పారు. తానే చెరువు కబ్జా చేసినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదని అన్నారు.

మంత్రికి ఫిర్యాదు చేసినా..!

గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన కేఎల్ఆర్ ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. సూరం చెరువు కబ్జాపై స్వయంగా ఆయనే జూలై 12న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, జూలై 16న తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నెల 8న నీటిపారుదల శాఖ డీఈఈకి కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఆయన ఫిర్యాదులపై అధికార యంత్రాంగం స్పందించకపోవడం ఏమిటని పలువురు విస్తుపోతున్నారు.

సాంకేతికంగా కొనసాగుతున్న భాగస్వామ్యం...

ప్రస్తుతం రియల్ వెంచర్‌లో తాను భాగస్వామిని కాదని, అయినప్పటికీ 'నమస్తే తెలంగాణ'లో తానే చెరువును కబ్జా చేసినట్టు వచ్చినందున పత్రికపై పరువునష్టం దావా వేస్తానని కేఎల్ఆర్ స్పష్టంచేశారు. అయితే అన్ని ఆన్‌లైన్ వెబ్‌సైట్స్, గూగుల్‌లో ఇప్పటికీ వర్టెక్స్-కేఎల్ఆర్ డెవలపర్స్ ఎల్ఎల్‌పీ పేరే కనిపిస్తున్నది. అదీగాక మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించగా.. ఈ డెవలపర్స్ ఎల్ఎల్‌పీఇన్-ఏఏఎన్-5936 నంబరుతో ఇప్పటికీ భాగస్వామ్యం కొనసాగుతున్నట్టుగా తేలింది. భాగస్వామ్యం (ఎల్ఎల్‌పీ) స్టేటస్ యాక్టివ్ (కొనసాగుతుంది)గానే ఉంది. ఇందులో కేఎల్ఆర్ కుమారుడు కిచ్చన్నగారి అభిషేక్, మురళీమోహన్ చక్కగురు భాగస్వాములుగా ఉన్నారు. దీనిపై కేఎల్ఆర్‌ను సంప్రదించగా.. వెంచర్‌లో ఒక భాగం వరకు మాత్రమే తమ భాగస్వామ్యం కొనసాగుతున్నదని, చెరువును కబ్జా చేసిన వైపు తనది లేదని చెప్పారు. ఒకే ప్రహరీలో రెండు వేర్వేరు వెంచర్లు సాధ్యమా? అన్నది ఎవరికీ అంతుబట్టని అంశం.

నేడు పెన్షన్ విద్రోహ దినం: జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఉద్యోగులపై కాంగ్రెస్ సీపీఎస్‌ను రుద్దిన రోజైన సెప్టెంబర్ 1ని ఉద్యోగ సంఘాలు 'పెన్షన్ విద్రోహ దినం'గా పాటిస్తూ వస్తున్నాయి. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఆదివారం తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ గన్‌పార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నది. ధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మిగతా ఉద్యోగ సంఘాలు సైతం నిరసన చేపట్టాలని నిర్ణయించాయి.

అంటగట్టింది హస్తం పార్టీయే..

రాష్ట్రంలో ఉద్యోగుల పింఛన్ హక్కును హరించింది కాంగ్రెస్ పార్టీయే. దీనికి పూర్తి బాధ్యత ఆ ప్రభుత్వానిదే. 2004 సెప్టెంబర్ 1న అప్పటి రాజశేఖర్‌రెడ్డి సర్కారు.. ప్రభుత్వ ఉద్యోగులందరికీ సీపీఎస్‌ను వర్తింపజేస్తూ జీవో-653 జారీచేసింది. ఈ ఒక్క నిర్ణయంతో ఉద్యోగులందరినీ రోడ్డున పడేసింది. ఈ పాపానికి ఒడిగట్టిన కాంగ్రెస్సే ఇప్పుడు మళ్లీ తెలంగాణలో అధికారంలో వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి 8 నెలలైనా ఉద్యోగ సంఘాలను పిలిచి మాట్లాడలేదు. కనీసం చర్చించలేదు. పాత పెన్షన్‌ను పునరుద్ధరించాల్సిందేనని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చారు.

ఏకీకృత పెన్షన్ విధానాన్ని అనుమతించొద్దు

చిన్నారెడ్డికి జేఏసీ వినతి

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): లక్షలాది మంది ఉద్యోగులకు మేలు చేకూర్చే పెన్షన్ విధానాన్ని అమలు చేసే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి పేర్కొన్నారు. శనివారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వవద్దని, 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

భట్టి విక్రమార్క సభ వెలవెల

- రామగుండం పర్యటనలో చేదు అనుభవం
- మాట్లాడుతుండగానే లేచి వెళ్లిపోయిన జనం
- ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన సభాప్రాంగణం

జనం లేక వెలవెలబోయిన రామగుండంలో నిర్వహించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభ

పెద్దపల్లి, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రామగుండం సభ తుస్సుమన్నది. ఆయనతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు చేదు అనుభవం ఎదురైంది. భట్టి మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోగా, సభా ప్రాంగణం ఖాళీ కుర్చీలతో వెలవెలబోయింది. నాయకులు, కార్యకర్తల హడావిడి మినహా పెద్దగా స్పందనే కనిపించలేదు. పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గంలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మంత్రుల టూర్ ఉండగా, వర్షం కారణంగా మంత్రులు ఆలస్యంగా చేరుకున్నారు. రామగుండం బీ పవర్ థర్మల్ ప్రాజెక్టుకు మంత్రుల బృందం చేరుకునే సరికి భారీ వర్షం కురిసింది. తర్వాత వాటర్ ప్రూఫ్ టెంట్ల మధ్య బహిరంగ సభను ఏర్పాటును నిర్వహించారు. మధ్యాహ్నం 1.40 గంటల ప్రాంతంలో ప్రారంభమైన సభలో దాదాపుగా 2 వేల కుర్చీలను ఏర్పాటు చేయగా, అందులో సగం కూడా నిండలేదు. వేదికపైకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. దీనికితోడు వక్తల ప్రసంగాలు సైతం పెద్ద ఎత్తున కొనసాగడంతో ప్రజలు విసుక్కున్నారు. ముఖ్యఅతిథిగా వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి తన ప్రసంగాన్ని 3.30 గంటలకు ప్రారంభించగా, అరగంటకు పైనే సాగింది. అప్పటికే అలసిపోయిన ప్రజలు అక్కడి నుంచి నిష్క్రమించారు. చివరికి భట్టి మాట్లాడే సమయంలో సభలో 30 శాతం మంది కూడా లేకపోవడంతో వేదికపై ఉన్న వారంతా నిరాశ చెందారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

గోదావరిఖని, ఆగస్టు 31: సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దని, సంస్థకే కేటాయించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు రియాజ్ అహ్మద్, టీ శ్రీనివాస్, ఐ కృష్ణ, కామేర గట్టయ్య, కుమారస్వామి డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బహిరంగ లేఖ రాశారు. అనంతరం వారు గోదావరిఖనిలో మాట్లాడారు. సింగరేణి తన సొంత ఖర్చులతో అనేక బ్లాకులను గుర్తించి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి ఒప్పించేందుకు కృషిచేయాలని కోరారు.

కాళేశ్వరం విచారణ కమిషన్ గడువు పెంపు

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం విచారణ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు తొలిసారి పెంచిన నెల రోజుల గడువు ఆగస్టు 31తో ముగిసింది. దీంతో మరో రెండునెలలపాటు కమిషన్ గడువు పొడిగిస్తూ నీటిపారుదలశాఖ శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ వ్యవహారంలో విచారణ జరిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ ఇప్పటివరకు ప్రాజెక్టుల నిర్మాణ ఏజెన్సీలు, అందులో భాగస్వాములైన ఇంజినీర్లను, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ అధికారులను విచారించింది.

రామగుండం పవర్ ప్లాంట్‌పై రగడ

- ఆర్టీఎస్ స్థానంలో 800 మె.వా. కొత్త ప్లాంట్
- డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన
- నిర్మాణంలో సింగరేణి భాగస్వామ్యం వద్దు
- విద్యుత్తు ఉద్యోగ సంఘాల జేఏసీ డిమాండ్
- పూర్తిగా జెన్‌కో ద్వారానే నిర్మించాలని వినతి

హైదరాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా, రామగుండంలో సింగరేణి భాగస్వామ్యంతో కొత్త థర్మల్ ప్లాంట్ నిర్మించనున్నామన్న ప్రభుత్వ ప్రకటనను విద్యుత్తు ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ ప్లాంట్‌ను పూర్తిగా టీజీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. రామగుండంలో ప్రతిపాదిత ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం సందర్శించారు. ఆ స్థలంలో సింగరేణి, టీజీ జెన్‌కో సంయుక్తంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మిస్తాయని ప్రకటించారు. దీంతో పవర్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ద్వారానే చేపట్టాలని, సింగరేణి భాగస్వామ్యం అవసరంలేదని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీపీఈజేఏసీ) శనివారం హైదరాబాద్‌లో ప్రకటన విడుదల చేసింది. జాయింట్ వెంచర్ ప్రతిపాదనలను ఉపసంహరించుకొని కేవలం జెన్‌కో ద్వారానే ఈ ప్లాంట్‌ను నిర్మించాలని జేఏసీ చైర్మన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్‌రావు, కో చైర్మన్లు శ్రీధర్, బీసీ రెడ్డి, వైస్‌చైర్మన్లు డిమాండ్ చేశారు.

అన్ని అనుకూలతలున్నా..

రామగుండంలో 1971లో 'రామగుండం థర్మల్ స్టేషన్ (ఆర్టీఎస్)' - బీ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. 50 ఏండ్ల పాటు ఈ ప్లాంట్ సేవలందించింది. జెన్‌కో ఆధ్వర్యంలో నడిచిన ఈ ప్లాంట్‌ను సాంకేతిక కారణాలతో మూసివేశారు. ఇక్కడే కొత్త పవర్‌ప్లాంట్‌ను నిర్మించాలని స్థానికులు కొంతకాలంగా కోరుతున్నారు. జెన్‌కో వద్దనున్న ఈ 560 ఎకరాల స్థలాన్ని సింగరేణికి కేటాయించి, ఆ సంస్థ ద్వారా ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహకాలు చేసింది. దీనిని పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేతలు వ్యతిరేకించారు. భట్టిని కలిసి జెన్‌కో ద్వారానే చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. తాజాగా డిప్యూటీ సీఎం జాయింట్ వెంచర్ ప్రతిపాదనను తెరపైకి తేవడంతో విద్యుత్తు జేఏసీ నేతలు వ్యతిరేకిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యం, సమర్థులైన ఇంజినీర్లు, థర్మల్, హైడల్ ఉత్పాదక స్టేషన్ల నిర్మాణం, నిర్వహణలో గొప్ప అనుభవమున్న సిబ్బంది సంస్థకున్నారు. అత్యంత సమీపంలోని శ్రీపాదసాగర్ నుంచి 1.89 టీఎంసీల నీటిని తీసుకునే వీలుంది. రామగుండంలోనే తగినంత బొగ్గు అందుబాటులో ఉంది. రైల్వే లైన్ సమీపంలోనే ఉంది. ఇన్ని అనుకూలతలున్నప్పుడు సింగరేణి భాగస్వామ్యం అవసరమేంటని ఉద్యోగ సంఘాల నేతల ప్రశ్నిస్తున్నారు.

మంచిర్యాల కాంగ్రెస్‌లో లుకలుకలు

- రామగుండం నుంచి అలిగి వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుకు త్వరలో కీలక బాధ్యతలు
- మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి





మంచిర్యాల, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా లుకలుకలు బయటపడ్డాయి. పెద్దపల్లి జిల్లాతోపాటు మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ పర్యటించాల్సి ఉండగా.. రామగుండంలో మంత్రుల పర్యటన ఆలస్యం కావడంతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆయన కుమారుడు, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. మంత్రుల పర్యటన సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై రామగుండంలో మంత్రుల ముందే వివేక్ ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఈ మేరకు రామగుండం సింగరేణి గెస్ట్ హౌస్ నుంచి వివేక్ సహా ఎంపీ వంశీ అలిగి చెన్నూర్‌కు బయల్దేరి వచ్చారు. దీంతో డిప్యూటీ సీఎం చెన్నూర్ పర్యటనను అర్ధంతరంగా రద్దు చేసుకున్నారు. మంత్రి పదవి కోసం ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఈ ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య వర్గపోరు తీవ్రమైంది. అలిగి వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని చెన్నూర్ పర్యటనకు తీసుకువస్తానని, రాజకీయంగా ఇకనుంచి మరింత గట్టిగా ముందుకెళ్దామని వివేక్ సదరు నాయకులను భరోసా కల్పించారు. రామగుండం నుంచి వివేక్ వెళ్లిపోయాక కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రేమ్‌సాగర్ రావు నాయకత్వంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి నమ్మకం ఉన్నదని అన్నారు. పార్టీకి, కార్యకర్తలకు అండగా నిలిచిన ఆయనకు కీలక బాధ్యతలు రాబోతున్నాయని తెలిపారు. ఈ పరిణామంపై ఎమ్మెల్యే వివేక్ కుటుంబం ఎలా స్పందిస్తుందో చూడాలి.